ప్రజాశక్తి

సోమవారం 22 సెప్టెంబర్ 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

విద్యుత్ కాంతులతో దుర్గగుడి

అంతా సిద్ధం

- నేటి నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు
- ఈ ఏడాది 11 అలంకారాల్లో దుర్గమ్మ దర్శనం
- తొలిరోజు శ్రీ బాలాత్రిపుర సుందరిదేవి అలంకారం
- దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సిపి
- 'విజయవాడ ఉత్సవ్'కు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-విజయవాడ, సిటీ, అర్బన్

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం దసరా ఉత్సవాలకు సిద్ధమైంది. సోమవారం నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏడాది పది అవతారాల్లో దర్శనమిచ్చే అమ్మ వారు ఈసారి 11వ ప్రత్యేక అవతారం కాత్యాయనీదేవిగా యాత్రికులకు దర్శనం ఇవ్వనున్నారు. మొదటి రోజున దుర్గమ్మ శ్రీ బాలాత్రిపురసుందరీ దేవిగా దర్శనమిస్తారు. ఉదయం తొమ్మిది గంటలకు యాత్రికులను దర్శనానికి అనుమతిస్తారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఇంద్రకీలాద్రికి చేరుకున్న సిపి రాజశేఖరబాబు దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. దీంతో దసరా ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. మరోపక్క 'విజయవాడ ఉత్సవ్'కు నాలుగు ప్రధాన వేదికలు సిద్ధమయ్యాయి.

...వార్తలు లోపలి పేజీల్లో

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న సిపి దంపతులు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి : సిపిఎం

వార్త 6లో

నేటి అలంకరణ

శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి

ఉద్యోగ భద్రత కోసం ఐక్యంగా ఉద్యమించాలి

- యుపిహెచ్‌సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింహాచలం
- యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీను నాయక్, రాజారత్నరాజు

ప్రజాశక్తి-విజయవాడ

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, వాటి సాధన కోసం ఉద్యోగులంతా ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింహాచలం పిలుపునిచ్చారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఎన్‌టిఆర్ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. విజయవాడ ఎంబివికె 4వ అంతస్తులో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. యూనియన్ గౌరవాధ్యక్షులుగా వి.విజయ్ కుమార్, ప్రెసిడెంట్‌గా బి.శ్రీను నాయక్, ప్రధాన కార్యదర్శిగా టి.రాజా రత్న

రాజు, ట్రెజరర్‌గా కె.రాజశేఖర్ ఎన్నికయ్యారు. వర్కింగ్ ఉమెన్ వింగ్ ప్రెసిడెంట్‌గా కె.విజయలక్ష్మిని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా యం.వి.గోపాల్, జి.ప్రసాద్, ఆర్గనైజింగ్‌గా సెక్రటరీలుగా బి.రమ్య, పి.ప్రశాంతి, పి.విజయ లక్ష్మి, అనురాజ్ ఖాన్ పటాన్, డి.కృష్ణ మోహన్, బి.ఫణీంద్ర, కె.ఉదయ్, ఐ.జస్వంత్, వైస్ ప్రెసిడెంట్స్‌గా కె.శాంతమణి, పి.అనిత, సిహెచ్.కళ్యాణి, కె.వి.సురేంద్ర, వి.శివ ప్రసాద్, వై.రాజేష్, యం.రాంబాబు, రాము, జాయింట్ సెక్రటరీలుగా సుజాత, డి.మార్త, కె.ప్రియాంక, యల్.విజయ్ కుమార్, కె.సింధు, చిన్ని, మహేష్, అప్పయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ... యుపిహెచ్‌సి ఉద్యోగులు అధిక పని భారంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ఐపిహెచ్‌ఎస్ ప్రకారం డిఎంఇ, డిఎస్‌హెచ్, డిపిహెచ్ అండ్ ఎఫ్‌డబ్ల్యు వలె డిఎస్సీ, ఆర్‌ఒఆర్ ప్రకారం నియమంచిబడి విధులు నిర్వహిస్తున్నప్పటికి వేతనాల్లో తీవ్ర వ్యత్యాసం వలన అన్యాయానికి గురవుతున్నామని తెలిపారు. తక్షణమే హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వార్షిక ఇంక్రిమెంట్స్, పర్మామెన్స్ ఇంక్రిమెంట్స్, ఉద్యోగ విరమణ సౌకర్యాలు, స్పష్టమైన ఖాళీలలో బదిలీలు చేపట్టాలని, ఉద్యోగుల విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో యుపిహెచ్‌సి ఉద్యోగులుకు కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన హామీ మేరకు మెరుగైన (ఎంటిఎస్) వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని అన్నారు.

ట్యాంకు ఎక్కి దంపతుల హల్‌చల్

ప్రజాశక్తి-వత్సవాయి

తమకు న్యాయం చేయాలని కోరుతూ దంపతులు మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్ ఎక్కిన సంఘటన మండల కేంద్రమైన వత్సవాయిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. వత్సవాయికి చెందిన మట్టపల్లి కొమరయ్య, జి.నాగరాజు కలిసి ఐదు సంవత్సరాల క్రితం మేకల వ్యాపారం చేశారు. వ్యాపార లావాదేవీల్లో నాగరాజుకు కొమరయ్య రూ.1.50 లక్షల వరకు ఇవ్వాల్సి ఉంది. కొంతకాలంగా నగదు చెల్లించే విషయంలో కొమరయ్య తాత్సారం చేస్తున్నారు. నగదు ఇవ్వకపోవడంతో కొమురయ్య ద్విచక్ర వాహనాన్ని నాగరాజు లాక్కున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన కొమురయ్య తన భార్య నాగమల్లేశ్వరితో కలిసి గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి హల్‌చల్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ద్విచక్రవాహనాన్ని ఇప్పిస్తామని హామీ ఇచ్చి కొమరయ్య దంపతులను వాటర్ ట్యాంకు నుంచి కిందకి దింపారు. దీంతో స్థానికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

నేడు పిజిఆర్ఎస్ రద్దు: కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : దసరా ఉత్సవాల సందర్భంగా ఎన్‌టిఆర్ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈ నెల 22, 29 తేదీల్లో రద్దు పరిచినట్లు కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు దీనిని గమనించి సహకరించాలని కోరారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నేడు లేదు

దసరా శరన్నవరాత్రుల వేడుకల సందర్భంగా, అధికారులందరూ దసరా విధుల్లో నిమగ్నమై ఉన్నందున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి లక్ష్మీశా ఆదేశాల మేరకు ఈ నెల 22, 29 తేదీల్లో విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన జోనల్ కార్యాలయాల్లో నిర్వహించడం లేదని, ప్రజలు దీని గమనించి సహకరించాలని విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర కోరారు.

జిఎస్‌టి విధానాలపై ప్రత్యేక డాష్ బోర్డు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

రానున్న జీఎస్టీ నూతన సంస్కరణల విధానాల అమలు తీరును ఎంఎస్ఎంఈలు, ఇతరత్రా వర్గాల విక్రేతలకు అందించేందుకుగాను ప్రత్యేక డాష్ బోర్డును ఏర్పాటు చేసినట్లు ఫ్లిప్‌కార్ట్ ఎస్‌విపి, మార్కెట్‌ప్లేస్ హెడ్ సకైత్ చౌదరి తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. స్వదేశీ ఇ కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్, పండుగ సీజన్ సమీపిస్తున్న కొద్దీ దాని విక్రేత పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తూనే ఉందన్నారు. గత ఆరు నెలల్లో విక్రేతల లావాదేవీలలో 25 శాతం నుంచి 30 శాతం పెరుగుదల, పండుగ కాలం (జూన్ – ఆగస్టు 2025) వరకు త్రైమాసికంలో 30 శాతం వరకు వృద్ధితో, ఫ్లిప్‌కార్ట్ మార్కెట్‌ప్లేస్ లక్షలాది ఎంఎస్ఎంఈలు, చేతివత్తులవారు , వ్యవస్థాపకులు భారతదేశంలోనే అతిపెద్ద షాపింగ్ ఈవెంట్‌కు సిద్ధం కావడానికి వీలు కల్పిస్తోందన్నారు. ఏఐ ఆధారిత సాధనాలు, సరళీకత విక్రేత పరిష్కారాలు, వేగవంతమైన సెటిల్మెంట్స్ , అభివద్ధి చెందుతున్న మార్కెట్లలో స్థిరమైన విస్తరణ ద్వారా, విక్రేతలు బలమైన వద్ధిని చూస్తున్నారన్నారు. రాబోయే పండుగ సీజన్‌ను ఒడిసిపట్టేందుకు మంచి స్థితిలో ఉన్నారు. ఈ వద్ధిని శిక్షణా సెషన్‌లు, లైవ్ కామర్స్ వంటి కొత్త ఫార్మాట్‌లు, విస్తరించిన ఫుల్ ఫిల్మెంట్ మౌలిక సదుపాయాల ద్వారా బలోపేతం చేస్తున్నారని, పండుగ సమయంలో విక్రేతలు స్థిరంగా స్కేల్ చేయగలరని ఇది నిర్ధారిస్తుందని చెప్పారు.

వైద్య విధానంపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ

మారుతున్న కాలానికి అనుగుణంగా వైద్య రంగంలో వస్తున్న నూతన వైద్య విధానం గురించి పిఎంపిలు, ఆర్‌ఎంపిలు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్దన్ అన్నారు. ఆర్ఎంపీ అంటే సమాజంలో గౌరవం, ప్రతిష్ఠ ఉండేలా, అల్లోపతిలో ధీటుగా వైద్య పద్ధతులను నేర్చుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ పిఎంపి, ఆర్‌ఎంపిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఉమ్మడి కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో విజయవాడ గురునానక్ రోడ్‌లోని నాక్ కల్యాణ వేదికలో ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో టీడీ జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పిఎంపి, ఆర్‌ఎంపిలలో కూడా అద్భుతమైన వైద్యులు ఉన్నారని, కానీ వారు తమ వైద్య పరిధిని దాటి చిన్న మచ్చ కూడా తెచ్చుకోవద్దని సూచించారు. ఈ సమావేశం ద్వారా అందరిలో పరివర్తన రావాలని, వ్యవస్థ కోసం, సమాజంలో మీ వైద్యం అంటే బ్రాండ్ పడేలా మంచి వైద్యం నేర్చుకోవాలని, శిక్షణ తరగతులకు హాజరుకావాలని, సిలబస్ తెప్పించుకోవాలని, నోట్స్ దగ్గర పెట్టుకోవాలని తెలిపారు. చాలా మంది

ఆర్‌ఎంపీలు సేవా భావంతో చేస్తున్నారన్నారు. ఆర్‌ఎంపిలు విజయవంతంగా చేసిన వైద్యానికి సంబంధించిన సక్సెస్ స్టోరీస్‌ను సోషల్ మీడియాలో పెట్టి ప్రజలకు తెలియజేయాలన్నారు. అన్ని జిల్లాల్లో జాయింట్ యాక్షన్ కమిటీలు వేసుకొని, సమావేశాలు నిర్వహించుకుంటూ లక్ష్యాన్ని వీలైనంత తొందరలో సాధిద్దామని అన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పీఎంపీ, ఆర్‌ఎంపీస్ జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ సలహాదారు లంకదాసరి ప్రసాదరావు, ఫెడరేషన్ ఆఫ్ కమ్యూనిటీ పారామెడిక్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు విబిటి రాజు, ది గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పీ రాధా క్రష్ణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణా

- ఎనిమిది మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి- మైలవరం

గోవులను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్న ఎనిమిది మందిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మైలవరం పరిసర ప్రాంతాలలో గోవులను కొనుగోలు చేసి మండలంలోని చంద్రాల గ్రామం నుండి ఆటోలలో హైదరాబాద్, కేరళకు తరలిస్తున్నారని సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. ఈ దాడిలో రెండు ఆటోలు, హైదరాబాదుకు చెందిన నలుగురు, మరో ఇద్దరు ఆటో డ్రైవర్లు, చంద్రాల గ్రామానికి చెందిన ఒకరు, హైదరాబాద్‌కు చెందిన మరొకరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో స్వాధీనం చేసుకున్న 34 గోవులను గోశాలకు తరలించినట్లు తెలిపారు.

ఎస్‌బిఐ జూనియర్ అసిస్టెంట్ ప్రిలిమ్స్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్‌బిఐ జూనియర్ అసిస్టెంట్ ప్రిలిమ్స్ ప్రవేశ పరీక్ష శనివారం, ఆదివారం జరిగినట్లు ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. రెండు రోజులపాటు ఎనిమిది విడతల్లో రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన 1200 అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. తమ కళాశాలలో జాతీయ స్థాయి పరీక్షలు ఎల్లప్పుడూ నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

యూరియా కోసం రైతుల కష్టాలు

ప్రజాశక్తి - తిరువూరు

తిరువూరు మండలం టేకులపల్లి సొసైటీలో పంపిణీ చేస్తున్న యూరియా కోసం మహిళా రైతుల సైతం అవస్థలు పడ్డారు. సొసైటీ పరిధిలోని చౌటపల్లి, గానుగపాడు, జి.కొత్తూరు, టేకులపల్లి, పల్లెర్లమూడి, చిక్కుళ్ళగూడెం, చిట్టేల, ఆంజనేయపురం గ్రామాలకు చెందిన రైతులు యూరియా కోసం బారులు తీరారు. సొసైటీకి 800 బస్తాలు మాత్రమే రావడంతో ఒక్కసారిగా రైతులు ఒకరినొకరు నెట్టుకుంటూ వెళ్ళడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సత్యనారాయణ సొసైటీ వద్దకు వెళ్లి రైతులను వరుస క్రమంలో ఉంచే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. పోలీసులు రైతులను అదుపు చేయలేక చేతులెత్తేయడంతో సొసైటీ సిబ్బంది యూరియా

సరఫరాకు టోకన్ల పంపిణీ చేసినా సీరియల్ వచ్చే సరికి తమకు యూరియా దక్కదేమోనని ఎవరికి వారు సొసైటీలోకి వెళ్లేందుకు పోటీపడ్డారు. సిబ్బంది హెచ్చరిస్తున్నా రైతులు తోపులాడుకోవడంతో మహిళలు, వృద్ధులు ఇబ్బందికి గురయ్యారు. చివరకు యూరియా అయిపోయిందని చెప్పటంతో రైతులు నిరాశ చెందారు.

వైద్యులు లేక రోగుల అవస్థలు

- ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రిలో ఇబ్బందులు

ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలలో సరిపడినంతమంది వైద్యులు లేక చికిత్స కోసం వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఉయ్యూరు, తోట్లవల్లూరు, కంకిపాడు, పమిడిమ ఎక్కల మండలాలకు కేంద్రంగా ఉన్న ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు చుట్టుపక్కల 50 గ్రామాలనుండి ప్రతిరోజూ 200 మంది వరకు ప్రజలు వైద్య కోసం వస్తుంటారు. వైద్యశాలలో పనిచేస్తున్న సర్జన్, దంతవైద్యుడు, గైనకాలజిస్టు, ఎండిజనరల్ మెడిసిన్, డయాబెటిక్ వైద్యుడితో పాటు స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్ కొద్దిరోజుల క్రితం బదిలీపై వేరే వైద్యశాలలకు వెళ్లారు. వారిస్థానంలో ఇప్పటివరకు ఎవరూ రాకపోవడంతో ఉన్న ముగ్గురు వైద్యులలో ఒకరిని డిప్యుటేషన్పై మచిలీపట్నం వెళుతుండగా, ఒకరు నైట్ డ్యూటీలో ఉంటుండగా రోగులకు వైద్యసేవలందక గంటల తరబడి పడిగాపులు పడవలసిన వస్తుంది. దీనికితోడు పమిడిముక్కల, తోట్లవల్లూరు, కంకిపాడు మండలాల నుండి యాక్సిడెంట్ కేసులు, మెడికో లీగల్ కేసులకు పోస్టుమార్టం ఇక్కడే చేయవలసి వస్తున్న నేపథ్యంలో వైద్యుల కొరకు రోగులు చాలా సమయం వేచి ఉండవలసిన పరిస్థితుల్లో ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు ఎక్సరే విభాగం పూర్తిగాలేకపోవడం వల్ల రోగుల్లో ఇబ్బంది పడుతున్నారు.

డాక్టర్లు లేక గంటల తరబడి వేచి ఉంటున్నారు :

టి.శివన్నారాయణ.

వందల సంఖ్యలో రోగులు ఆసుపత్రికి వస్తుంటే సరిపడనంతమంది డాక్టర్లు లేక గంటల తరబడి వేచి ఉండవలసి వస్తుంది. దూర ప్రాంతాల నుండి వచ్చేవారికి సకాలంలో వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారు.

డాక్టర్లు లేక తీవ్ర ఇబ్బందులు

మండవ జయదేవ్, ప్రభుత్వ వైద్యశాల అభివద్ధి కమిటీ చైర్మన్

వైద్యులను నియమించాలని లేఖలు రాసినా ఫలితం లేదు. బదిలీపై వెళ్ళిన డాక్టర్ల స్థానంలో ఎవ్వరూ రాకపోవడంతో చికత్సకోసం ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్న డాక్టర్లలో ఒక గైనకాలజి సర్జన్ వారానికి మూడు రోజులు డిప్యుటేషన్పై మరో ఆసుపత్రికి పంపుతున్నారు. ప్రతిరోజూ 200 వరకు ఓపీ ఉంటుంది. ఈపరిస్థితుల్లో సరిపడనంత మంది డాక్టర్లు లేక రోగులు అవస్థలు పడుతున్నారని వెళ్లినవారి స్థానంలో డాక్టర్లను నియమించాలని డీసీహెచ్కు లేఖలు రాసినా పట్టించుకోవడం లేదు. 30 పడకల ఆసుపత్రి కావడంతో ఔట్ పేషెంట్లతో పాటు ఇన్ పేషెంట్లు ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో వెంటనే డాక్టర్లను నియమించాలి.

చికిత్సకోసం పడిగాపులు పడుతున్న రోగులు

త్వరలో నియమిస్తాం :

శేషుబాబు, జిల్లా వైద్యసేవల కోఆర్డినేటర్

సాధారణ బదిలీలు, ఉద్యోగోన్నతి కారణంగా డాక్టర్ల బదిలీలు జరిగాయి. హాస్పిటల్కు వచ్చే రోగులకు వైద్యసేవలందించేందుకు సరిపడా డాక్టర్లను కేటాయించి సత్వర సేవలందించేలా కృషి చేస్తాం.

ఊరెళ్లేవారు సమాచారమివ్వండి : సిఐ

ప్రజాశక్తి-గుడివాడ : దసరా పండుగ సెలవు లలో ప్రజలు ఇంటిని వదలి సొంత ఊర్లకు, ఇతర ప్రాంతాలకు వెళితే వారు సమాచారాన్ని పోలీస్ స్టేషన్కు అందిస్తే రాత్రి గస్తీ సమయాలలో మీ ఇంటిపై నిఘా పెట్టి మీ ఇళ్లల్లో చోరీలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామాని 2టౌన్ సిఐ హనిష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ డబ్బు, విలువైన ఆభరణాలు ఇంట్లో ఉంచి వెళ్ళరాదని, మీ ఖరీదైన వస్తువులను బ్యాంక్ లాకర్లో భద్రపరచుకోవలన్నారు. అనుమానంగా సంచరించే వారి గురించి, తాళం వేసిన ఇండ్ల వద్ద అపరిచిత వ్యక్తులు కనబడితే పోలీసు స్టేషన్కు, డయల్ 112కు వెంటనే సమాచారం అందించాలన్నారు. పండుగ సందర్భంగా పెద్ద పెద్ద కంపెనీలు మంచి మంచి ఆఫర్లు ఇచ్చినందున ఇదే అదునుగా భావించి సైబర్ నేరగాళ్లు డూప్లికేట్ ఐడి క్రియేట్ చేసి ప్రజలను మోసం చేస్తారన్నారు. అవసరం లేకుండా వచ్చే మెసేజ్లలో బ్లూ కలర్ లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. సైబర్ నేరానికి గురైన వారు వెంటనే 1930కి కాల్ చేస్తే మీకు సహాయ సహకారాలు అందిస్తారన్నారు.

మాట్లాడుతున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కంకిపాడు : పోరంకిలోని పెనమలూరులో ప్రెస్ క్లబ్ వేదికగా ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని గ్రామ వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న దాదాపు 19 శాఖల సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించి తదుపరి కార్యాచరణపై తీర్మానాలు చేసారు. ఈనెల 27వతేదీ లోపు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబర్ ఒకటవ తేదీన పెన్షన్ పంపిణీ కూడా నిలుపుదల చేయడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ కృష్ణాజిల్లా రైతుసంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెడన శాసనసభ్యులు కాగిత కష్ణ ప్రసాద్కి వినతిపత్రం అందించారు. కృష్ణాజిల్లాలో కృత్తి వెన్ను, బంటుమిల్లి, మచిలీపట్నం, మోపిదేవి, కోడూరు, అవనిగడ్డ, నాగాయలంక, నందివాడ మండలా ల్లో వేలాది ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్నారని, ఈ మధ్యకాలంలో అమెరికా అధ్యక్షులు ట్రంప్ 50 శాతం పైగా సుంఖాలు విధించడం వల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సంక్షోభంలో ఉన్న ఆక్వా సాగును రైతాంగాన్ని రక్షించాలని, కేంద్ర ప్రభుత్వం ఎక్స్లెన్స్ నిధులిచ్చి కౌంటర్ గ్యారెంటీ ఇచ్చి ఆక్వా ఉత్పత్తులను ప్రస్తుత ధర కంటే తక్కువ లేకుండా మొత్తం కొనుగోలు చేస్తానని భరోసా ఇవ్వాలని, ధరలు స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలని, అంతులేకుండా పెరిగిన ఫీడ్ రేట్లు తగ్గించి సబ్సిడీపై రైతులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా రైతు సంఘ కార్యదర్శి గౌరీ శెట్టి నాగేశ్వరావు, దాసరి ఆదినారాయణ, తమ్ము ఏడుకొండలు, మూర్తి, రెడ్డి సురేష్, ఎస్ రాజ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఉచిత మధుమేహ వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపు ణులు గవిరినేని రజని 125 మందికి వైద్య పరీక్ష లు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. డాక్టర్ నర్ర గంగాధర్ రావు, వల్లభనేని రామకష్ణ, కొసరాజు బాపయ్యచౌదరి సహకారంతో మూల్పూరి సుధాకర్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈశిబిరంలో లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 50 మంది నిరుపేదలకు అన్నదానం, పాదరక్షకులు ఆదివారం పంపిణీ చేశారు. వల్లభనేని సుబ్బారావు, జానకమ్మ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదాన, పాదరక్షకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు తిరుమల తెలిపారు.

ఈదురుగాలులకు విరిగిన చెట్లు

ప్రజాశక్తి - నందివాడ: శనివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో నందివాడ మండలంలో పలుచోట్ల ప్రధాన రహదారికి అడ్డంగా చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జనార్ధనపురం, నందివాడ ప్రాంతం నుంచి ఇలపర్రు, లక్ష్మీ నరసింహపురం వచ్చిపోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు రెండు గంటలపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అటువైపుగా ప్రయాణిస్తున్న వాహనదారులు సంబంధిత అధికారులు ఫోన్ చేసి తెలియపరిచిన ఎటువంటి స్పందనలేదని మండల ప్రజలు తమఆవేదన వ్యక్తం చేశారు.

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలోని ఎలక్ట్రికల్ సిబ్బంది జోరువర్షం లోను, సమస్య ఏర్పడిన క్షణాల్లో సంఘటన స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. శనివారం రాత్రి కురిసిన వర్షం, హోరుగాలి కు భారీగా చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. ట్రాన్స్ కో ఎడీఈ బి.నవీన్ కుమార్, ఎఈ అశోక్ కుమార్ లు క్షణాల్లో ధ్వంసమైన ఈడుపుగల్లు కండక్టర్ను అర్ధరాత్రి సంఘటన స్థలంలో ఉండి పనులు యుద్ధప్రాతిపదికన చేయించారు. కంకిపాడు, ప్రొద్దుటూరు, ఈడుపుగల్లు పునాది పాడు లలో నెలకొరిగిన భారీ చెట్లు ను తొలగించి, 16 విద్యుత్ స్తంభాలను వేగవంతం గా ఏర్పాటు చేయించి, విద్యుత్ ను సరఫరాను పునరుద్ధరించారు.



నేటి నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-గుడివాడ : ఈనెల 22వ తేదీ సోమవారం నుండి శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గుడివాడ పట్టణంలోని శ్రీ భీమేశ్వర స్వామి, శ్రీ గౌరీశంకర స్వామి, శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవాలయాల్లో జరగనున్న శరన్నవరాత్రి మహోత్సవాల ప్రచార పత్రికలను ఆదివారం టిడిపి నాయకులు ప్రారంభించారు. స్థానిక ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ప్రజావేదికలో దేవాలయాల ధర్మకర్తల కమిటీ సభ్యులతో కలిసి టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, వెనిగండ్ల రామకష్ణ (నాని) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఈవో కందుల గోపాలరావు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుండి అక్టోబర్ మూడో తేదీ వరకు దేవాలయాల్లో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలు జరగనున్నాయని, ఈ ఏడాది అమ్మవారు విశేషంగా 11 అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. శ్రీ భీమేశ్వర దేవస్థాన ఉత్సవ కమిటి చైర్మన్ పట్టపు చిన్నా, శ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థాన కమిటీ చైర్మన్ నేరుసు బోసు, శ్రీ వేణుగోపాల స్వామివారి దేవస్థానం కమిటీ చైర్మన్ అంగడాల సతీష్, దేవాలయాల ధర్మకర్తల కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని డోకిపర్రు శ్రీ భూ సమేత వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం నుంచి దసరా నవరాత్రుల మహోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆదివారం ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారని దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు చెప్పారు. శ్రీ దేవి శరన్నవ రాత్రుల మహోత్సవములకు అమ్మవార్ల అవతారాలకు ఏర్పాటు చేసే నవరాత్రుల విశేష అలంకరణలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** మోపిదేవి మండల పరిధిలోని కే. కొత్తపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ దుర్గా కోటేశ్వర స్వామి వారి దేవస్థానంలో దసరా మహోత్సవములు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకురాలు రామిశెట్టి నాగరాణి ఆదివారం తెలిపారు. సోమవారం నుండి వచ్చేనెల రెండో తేదీ వరకు ఈ దసరా మహోత్సవాలు ఆలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి శ్రీ దుర్గా అమ్మవారికి కుంకుమ పూజ అలాగే రెండవ తేదీ గురువారం విజయదశమి సందర్భంగా సాయంత్రం ఏడు గంటలకు సెమీ పూజ పూజ నిర్వహిస్తామని తెలిపారు.

అలాగే మోపిదేవి మండల పరిధిలో పెద్ద కళ్ళేపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి దేవస్థానం 22వ తేదీ నుండి నుండి వచ్చేనెల 2 వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆదివారం తెలిపారు. ప్రతిరోజు శ్రీ నాగేశ్వరస్వామి వారికి అభిషేకాలు, కుంకుమార్చనలు జరుగుతా యన్నా రు. **ప్రజాశక్తి-గన్నవరం :** ఈనెల 22 నుంచి వచ్చే నెల 2 తేదీ వరకు గన్నవరంలోని శ్రీ కన్యకా పర మేశ్వరి మందిరంలో దసరా ఉత్సవంలో నిర్వహిస్తు న్నట్లు నిర్వాహక కమిటీ అధ్యక్షులు శ్రీకాకుళపు సాయి తెలి పారు. ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గుడివాడలో దసరా ఉత్సవాల పచ్రార పత్రిక అవిష్కరిస్తున్న దృశ్యం

దసరా ఉత్సవాల్లో పారిశుధ్య నిర్వహణకు చర్యలు

• విఎంసి ప్రజారోగ్య విభాగం ముఖ్యఅధికారి డాక్టర్ అర్జునరావు

ప్రజాశక్తి-విజయవాడ : దసరా శరన్న వరాత్రుల్లో శానిటేషన్ నిర్వహణలో ఎక్కడా ఎటువంటి లోపాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం ముఖ్య అధికారి (సిఎంఒహెచ్) డాక్టర్ కె. అర్జునరావుపేర్కొన్నారు. సోమవారం నుంచి (ఈ నెల 22 నుంచి) ప్రారంభమవుతున్న ఈ ఉత్సవాలకు ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో శానిటేషన్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజారోగ్య విభాగంలో శానిటేషన్ నిర్వహణకు కావాల్సిన రోజు వారి కార్మికులను కాంట్రాక్ట్ పద్ధతిలో ఏర్పాటు చేయడంతోపాటు వారికి సపోర్టుగా కొంత మంది విఎంసి శానిటరీ వర్కర్లు, పర్యవేక్షణాధికారులను ఏర్పాటు చేశామన్నారు. శానిటేషన్ మెరుగుదలకు భక్తులతో పాటు నగర ప్రజలు సహకరించాలన్నారు. దసరా నవరాత్రి ఉత్సవాలు, శానిటేషన్ నిర్వహణపై సిఎంఒహెచ్ ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేకించి, ఎంతో ముఖ్యమైన శానిటేషన్ నిర్వహణకు తీసుకున్న చర్యలు వివరించగలరు?

జవాబు: నగర కమిషనర్ ఆదేశాల మేరకు శానిటేషన్ నిర్వహణకు అవసరమైన రోజు వారీ కార్మికులను కాంట్రాక్ట్ పద్ధతిపై ఏర్పాటు చేయడం జరిగింది.

ప్రశ్న: ఎంత మంది రోజు వారీ కార్మికులను ఏర్పాటు చేశారు?

జవాబు: 1490 మంది కార్మికులను ఏర్పాటు చేయడం జరిగింది. వీరితోపాటు షిఫ్ట్‌కు 100 మంది విఎంసి శానిటరీ సిబ్బందిని కూడా తోడు చేశాం. కార్మికులతో పని చేయించడానికి 41 మంది శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు ఏర్పాటు జరిగింది. వీరందరినీ పర్యవేక్షించడానికి సిఎంఒహెచ్ దగ్గర నుంచి మూడు సర్కిల్స్ పరిధిలోని ఎఎంఒహెచ్‌లు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇనిస్పెక్టర్లు 107 మందిని ఏర్పాటు చేయడం జరిగింది.

ప్రశ్న: దుర్గగుడి పరిధిలో ఎన్ని డివిజన్లు, ఎన్ని పాయింట్స్‌లో ప్రధానంగా శానిటేషన్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సి ఉంటుంది?

జవాబు: దుర్గగుడి పరిసర ప్రాంతాలతో పాటు 22, 37, 38, 40 డివిజన్ల పరిధిలోని గుర్తించిన 41 పాయింట్స్‌లో కార్మికులు శానిటేషన్ పని చేయాల్సి ఉంటుంది. దుర్గగుడి పరిసర ప్రాంతాలతోపాటు పద్మావతి ఘాట్, పిఎన్ బస్‌స్టేషన్ ఏరియా, కృష్ణవేణిఘాట్, విఎంసి ప్రధాన కార్యాలయం, ఫ్లైఓవర్, ప్రకాశం బ్యారేజి ఏరియా, కుమ్మర పాలెం సెంటర్, తదితర ప్రాంతాల్లో శానిటేషన్ వర్క్ చేయాల్సి ఉంటుంది.

ప్రశ్న: షిఫ్ట్‌కు ఎంత మంది కార్మికులు, ఎన్ని షిఫ్ట్‌లు...?

జవాబు: మూడు షిఫ్ట్‌లు. మొదటి షిఫ్ట్‌కు 530+ రెండవ షిఫ్ట్‌కు మరో 530, మూడవ షిఫ్ట్‌కు 430 చొప్పున రోజువారీ కార్మికులు పని చేస్తారు. ఉదయం ఆరుగంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలు, అలాగే 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు పని చేయాలి. 54 కాంపాక్ట్ బిన్స్, మరో 48 గార్బేజ్ కాంపాక్టర్స్ ఆటోలు పని చేస్తున్నాయి.

ప్రశ్న: శానిటేషన్ వర్క్ ఎప్పటి నుంచి ఏ తేదీ వరకు నిర్వహించాలి?

జవాబు: జిల్లా కలెక్టర్, నగర కమిషనర్ నిర్దేశించినట్లు ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు శానిటేషన్‌వర్క్ చేయించాలి. 16 రోజుల పాటు జరగాలి.

ప్రశ్న: శానిటేషన్ నిర్వహణకు అయ్యే వ్యయం ఎంత? దానిలో విఎంసి వాటా ఎంత?

జవాబు: ఈ 16 రోజులపాటు శానిటేషన్ నిర్వహణకు రూ. 1.97 కోట్లు ఖర్చు అవుతుంది. దీనిలో 50 శాతం దుర్గగుడి, మరో 50 శాతం విఎంసి భరిస్తాయి. గ్లోబల్ టెండర్ పద్ధతిలో ఈ పనిని సదరు కాంట్రాక్టర్లు చేయించడం జరుగుతుంది. ప్రతి కార్మికుడికి షిఫ్ట్‌కు (ఎనిమిది గంటలు) లాబర్ వేజెస్ ఫర్ డేకు రూ. 590 ఇవ్వాల్సి ఉంటుంది. ఒక కార్మికుడిని ఒక షిఫ్ట్‌కు మాత్రమే పని చేయించాలి. రోజువారీ కార్మికులతో అదనపు పని గంటలు చేయించడానికి వీలు లేదు. బలవంతంగా, నిబంధనలకు విరుద్ధంగా పని చేయిస్తే అటువంటి కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాల్సి వస్తోంది. ఎఫ్ఆర్ఎస్ మస్టర్ విధానం అమలు చేయాలి.

ప్రశ్న: టాయ్‌లెట్స్ ఏర్పాటుపై?

జవాబు: రాష్ట్ర వ్యాప్తంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి తరలి వచ్చే భక్తులకుఎక్కడా ఎటువంటి ఇబ్బందులు రాకుండా తగిన సంఖ్యలో వ్యక్తిగత టాయ్‌లెట్స్ ఏర్పాటు చేయడం జరిగింది.

ప్రశ్న: కార్మికులకు షెల్టర్స్ ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు.?

జవాబు: శానిటేషన్ పని చేస్తున్న రోజువారీ కార్మికులకు వన్‌టౌన్ గాంధీజి మునిసిపల్ హైస్కూల్, అలాగే లారీ స్టాండ్ ఏరియాలో కార్మికులకు షెల్టర్ ఏర్పాటు జరిగింది. ఏ ఒక్క కార్మికుడికి ఇబ్బంది కల్గినా అందుబాటులో ఉన్న శానిటరీ ఇనిస్పెక్టర్, శానిటరీ సెక్రటరీలకు తెలుపుకోవచ్చు. పర్యవేక్షణాధికారులు కూడా కార్మికులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఉత్సవాలు ముగిసిన దాక చాలా జాగ్రత్తగా శానిటేషన్ నిర్వహణను పర్యవేక్షించాల్సి ఉంటుంది. అలాగే ఎటువంటి లోటుపాట్లు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలను క్షేత్ర స్థాయిలోపర్యవేక్షించే అధికారులు చూడాలి.

మైనారిటీల అభ్యున్నతికి కృషి : హసీంబేగ్

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : పేద మైనారిటీల అభ్యున్నతికి డా హసీంబేగ్ కృషి చేయాలని మునిసిపల్ మాజీ చైర్మన్, మచిలీపట్నం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. మానవతా కార్యదర్శి ,తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి డా హసీంబేగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్‌గా నియమించిన సందర్భంగా ఆదివారం సన్ స్టార్ స్కూలులో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ అభినందన సభకు మచిలీపట్నం మానవతా సంస్థ అధ్యక్షుడు జి కిషోర్ కుమార్ అధ్యక్షత వహించారు. సన్మాన గ్రహీత డా. హసీం బేగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మైనారిటీల అభివద్ధికి కేటాయించిన 170 కోట్ల రూపాయలను పేద ముస్లింల సంక్షేమానికి వినియోగిస్తామని చెప్పారు. జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ అధ్యక్షులు గొర్రెపాటి గోపీచంద్, నగరపాలక సంస్థ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, విద్యానిధి జిల్లా కన్వీనర్ పి శ్రీరాం, ఉపాధ్యక్షుడు అయ్యప్ప స్వామి, కళాశాల ప్రిన్సిపాల్ ఆదిత్య, జాయింట్ సెక్రటరీ పివి ఫణికుమార్ , కరెడ్ల సుశీల ,న్యాయవాది అజ్మతున్నీసా తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - గుడివాడ : పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్లు ఫీజురీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాల సంఘం సెప్టెంబర్ 22 నుండి నిరవధిక బంద్‌కు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కష్ణజిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సమరం విలేకరులతో మాట్లాడుతూ ఫీజుల బకాయిలు వెంటనే విడుదల చేయాలని గత రెండు సంవత్స రాలుగా ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పలుమార్లు ఎస్ఎఫ్ఐ ఇతర విద్యార్థి సంఘాలు, కళాశాల యాజమాన్యాలు విన్నవిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వంలో స్పందన లేదని దీనితో విద్యార్థులుకు ఫీజులు రాకా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. చివరికి ఎస్‌వి యూనివర్శిటీలో సైతం డబ్బులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని తెగేసిచెప్పడంతో ప్రిన్సిపల్ కార్యాలయ ఆవరణలో విద్యార్థి అర్థనగ్న ప్రదర్శన చేయడంతో యూనివర్శిటీ అధికారులు సర్టిఫికెట్లు ఇచ్చారన్నారు. ఇటువంటి ఘటనలు కోకొల్లలుగా వస్తున్నా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నా ప్రభుత్వం ఫీజులు విడుదల చేయడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. ఎన్నడులేని విధంగా యాజమాన్యాలే స్వయంగా బంద్‌కు పిలుపునివ్వడం కూటమి ప్రభుత్వం అసమర్థతకు అద్దం పడుతుందని, విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని కనబరుస్తుందన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫీజుబకాయిలను విడుదల చేయాలని కోరారు.

పని గంటల పెంపు కార్మికుల శ్రమను దోచుకోవడమే : సిఐటియు

ప్రజాశక్తి - గుడివాడ : ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం కార్మికుల పని గంటలు పెంచడానికి ఖండిస్తున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ సి పి రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 8 గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచడం దుర్మార్గమని, మహిళలతో రాత్రిపూట డ్యూటీలు చేయించడం మహిళా సాధికారిక మార్పులు కూడా చేయటాన్ని తప్పు పట్టారు. 8 గంటల పని విధానం 13 గంటలకు పెంచడం కార్మికుల శ్రమలు దోచుకోవడమేనన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రేపాని కొండ, ఆలూరి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్రైన వసతి... కూలి లేదు..!

• దసరా పారిశుధ్య కార్మికులను దగా చేస్తున్న కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి-విజయవాడ: దసరా ఉత్సవాల నేపథ్యంలో రోజువారీ శానిటేషన్ పని కోసం తీసుకొచ్చిన వందలాది మంది కూలీలను సదరు కాంట్రాక్టర్లు పలు రూపాల్లో దగా చేస్తున్నారు. మొదటి రెండు రోజుల్లోనే కూలీలకు కాంట్రాక్టర్లు చుక్కలు చూపించారు. మిగిలిన 14 రోజులు ఎలా గడవాలనే రీతిలో కూలీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భోజన సదుపాయం, మంచినీరు, మరుగుదొడ్డి, నిద్రించడానికి సరైన వసతి లేక వందలాది మంది కూలీల అవస్థలు వర్ణనాతీతంగా తయారైంది. కాంట్రాక్టర్లకు కనకవర్షం కురుస్తుంటే... కూలీలకు కష్టాలు తప్పడం లేదు. షిఫ్ట్‌కు (ఎనిమిది గంటలు) లేబర్ వేజెస్ ఫర్ డే ప్రకారం రూ.590 కాగా రూ.250 నుంచి 300 మాత్రమే కూలి ఇస్తామని సదరు కాంట్రాక్టర్లు కూలీలకు చెప్తున్నట్లు తెలిసింది. శానిటేషన్ పని కాంట్రాక్ట్ చేజిక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ల కింద, సబ్ కాంట్రాక్టర్లు, మేస్త్రీలు ఇలా పలువురు మధ్య దళారులు తయారయ్యి కూలీలకు దక్కాల్సిన కూలీని కాంట్రాక్టర్లు అధిక మొత్తంలో కాజేయడానికి పూనుకున్నట్లు తెలుస్తుంది. ఎన్‌టిఆర్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుంచి తరలించి తీసుకొచ్చిన కూలీలతో వారి ఇళ్ల వద్ద ముందస్తుగా చెప్పి తీసుకొచ్చిన మాటలకు, తీరా పనిలోకి దింపిన తరువాత కూలీలకు సదరు కాంట్రాక్టర్లు చుక్కలు చూపిస్తున్నారు. శని, ఆదివారాల్లో శానిటేషన్ పని చేసి అన్నపానీయాలు కరువై నీరశించి, షుగర్, బిపితో కూలీలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఇటువంటి పరిస్థితుల్లో సదరు కాంట్రాక్టర్ల వైఖరి కానీ, కూలీల అవస్థలు, బాధలు పట్టించుకునే అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ కరువయ్యారు. ఈ నెల 22 నుంచి ప్రారంభమై వచ్చే నెల 2 తేదీ వరకు జరుగుతున్న దసరా ఉత్సవాల సందర్భంగా పారిశుధ్య పని కోసం 1490 మంది రోజువారీ కూలీలను ఎన్‌టిఆర్ జిల్లాతో పాటు ఆయా జిల్లాల నుంచి విజయవాడకు తరలించారు. ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ (16 రోజులు) వరకు శానిటేషన్ పని చేయాల్సి ఉంటుంది. అత్యధిక మంది కూలీలను ఈ నెల 19వ తేదీకే విజయవాడకు తీసుకొచ్చారు. ప్రకాశం జిల్లా ఉలవపాడు, బాపట్ల జిల్లా

వేమూరు, పల్నాడు జిల్లా పిడుగురాళ్ల, ఇతర గ్రామాలు, గుంటూరు జిల్లా తెనాలి, ఎన్‌టిఆర్ జిల్లాలోని ఆయా గ్రామాల నుంచి కూలీలను కాంట్రాక్టర్లు విఎంసి పరిసర ప్రాంతాలకు తరలించారు. ఈ సారి శానిటేషన్ నిర్వహణ పనిని గ్లోబల్ టెండర్ పద్ధతిలో పలువురు కాంట్రాక్టర్లు (అధికార పార్టీ నేతల అండదండలతో) చేజిక్కించుకున్నారు. భోజనం, టిఫిన్‌తో పాటు ఉండటానికి వసతి, మెరుగైన కూలి ఇస్తామని కూలీలతో ముందుగా నమ్మపలికి... ఎంతో నమ్మకంతో ఇక్కడకు తీసుకొచ్చిన తరువాత...తీరా కూలీల బాధ్యత తమకు సంబంధం లేదనే పద్ధతిలో కాంట్రాక్టర్ల తీరు ఉంది. తమతో రోజంతా పని చేయిస్తూనే...కనీసం సమయానికి భోజనం పెట్టించడంలేదని, ఎక్కడో గుళ్లు, గోపురాల వద్దకు వెళ్లి భోజనం చేసిరాండనే ఉచిత సలహాలు కాంట్రాక్టర్లు ఇస్తున్నారని బాధిత కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క షిఫ్ట్ (ఎనిమిది గంటలు) మాత్రమే పని చేయించాలని, ఒక వేళ నిబంధనలకు విరుద్ధంగా రెండు షిఫ్ట్‌లు (16 గంటలు) చేయించినట్లయితే అటువంటి కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టడం జరుగుతుందని నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం ముఖ్యఅధికారి (సిఎంఒహెచ్) ఒకరిద్దరు కాంట్రాక్టర్లను ఇప్పటికే హెచ్చరించినట్లు తెలిసింది. అయినా నిబంధనలు పాటించకుండా తమకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఈ ఉత్సవాల్లో కార్మికుల శ్రమను దోచుకొని... లక్షల మొత్తంలో కాజేయడానికి పలువురు కాంట్రాక్టర్లు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నట్లు చర్చ జరుగుతుంది. ఇప్పటికయినా కార్మికులకు వసతులు కల్పించడంతో పాటు న్యాయమైన గిట్టుబాటు కూలి ఇవ్వాలని, లేకపోతే కార్మికుల పక్షాన పోరాడాల్సి వస్తోందని కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారి ని దర్శించుకునేందుకు యాత్రికులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా శానిటేషన్, తాగునీరు ఉచిత ప్రసాదం ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఈడే మోహన్, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వక్కలగడ్డలో స్వచ్ఛ సేవలు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం వక్కలగడ్డ గ్రామంలో అపూర్వమైన వక్కలగడ్డ గ్రామ పేరుతో స్వచ్ఛ కార్యక్రమాలు ప్రారంభించారు. ఎన్నారై మండవ శేషగిరిరావు, హనుమాన్ సురేంద్రనాథ్ బెనర్జీ ఆధ్వ ర్యంలో తెల్లవారుజామున ఐదు గంటల నుండి గంటన్నర పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. రైతులు, రైతు కూలీలు, అధికారులు మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని సేవలు అందిస్తున్నారు. మహిళా మండలి నేతలు ముళ్ళు పెద్ది రత్నకుమారి, హనుమాన్ల రాణి కుమారి, వీఆర్వో ఓలేటి నాగమల్లేశ్వరరావు, సొసైటీ విశ్రాంత సీఈఓ ఆలూరి బాబురావు, పాలడుగు పిచ్చేశ్వర రావ్, మల్లుపెద్ది అజయ్, శ్రీధర్ తదితరులు పాల్గొని సేవలు అందించారు.



అంతా సిద్ధం

- నేటి నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు
- ఈ ఏడాది 11 అలంకారాల్లో దుర్గమ్మ దర్శనం
- తొలిరోజు శ్రీ బాలా త్రిపుర సుందరిదేవి అలంకారం
- దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సిపి
- 'విజయవాడ ఉత్సవ్'కు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం దసరా ఉత్సవాలకు సిద్ధమైంది. సోమవారం నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 2 వరకు తిథుల ప్రకారం 11 రోజుల పాటు ఈ ఏడాది ఉత్సవాలు జరగనున్నాయి. ప్రతి ఏడాది పది అవతారాల్లో దర్శనమిచ్చే అమ్మ వారు ఈసారి 11వ ప్రత్యేక అవతారం కాత్యాయనీ దేవిగా యాత్రికులకు దర్శనం ఇవ్వనున్నారు. శరన్నవరాత్రి మహోత్సవాల తొలి రోజున అమ్మవారి అంతరాలయ శుద్ధి, స్నపనాభిషేకం నిత్య పూజల అనంతరం ఉదయం తొమ్మిది గంటలకు యాత్రికులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. మొదటి రోజున దుర్గమ్మ శ్రీ బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిస్తారు. దసరా ఉత్సవాలకు తరలివచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల సందర్భంగా రూ.500 టికెట్ల విక్రయాలు నిలుపుదలతో పాటు అంతరాలయ దర్శనం రద్దు చేశారు. రూ.100 రూ.300 టికెట్లు మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు. సాధారణ యాత్రికులకు అధిక ప్రాధాన్యత ఇస్తామని, వీఐపీ, వీవీఐపీ యాత్రికులకు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దర్శనం కేటాయిస్తామని వెల్లడించారు. సాయంత్రం వేళ అమ్మవారికిచ్చే పంచ హారతులకు వీఐపీల దర్శనాలు రద్దు చేసినట్లు వెల్లడించారు. వృద్ధులు, వికలాంగులు, గర్భినులకు సాయంత్రం నాలుగు గంటలకు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. క్యూ లైన్లలో వాటర్ బాటిల్స్, బిస్కెట్, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయనున్నారు. ఐదు వేల మంది పోలీస్ సిబ్బందితో దసరా ఉత్సవాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. 500 సీసీ కెమెరాలు, 25 డ్రోన్స్‌తో దసరా ఉత్సవాలను పర్యవేక్షించనున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు 12 చోట్ల పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేశారు. కనకదుర్గమ్మను ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తెలుగు చలనచిత్ర దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ సతీసమేతంగా దుర్గమ్మను దర్శించుకున్నారు.

'విజయవాడ ఉత్సవ్'కు ఏర్పాట్లు పూర్తి

పున్నమి ఘాట్ వద్ద సిద్ధమవుతున్న వేదిక

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

దసరా పండుగ సందడి మొదలవుతున్న వేళ విజయవాడ నగరం కళా వైభవంతో అలరించడానికి సిద్ధమవుతోంది. 'విజయవాడ ఉత్సవ్' పేరుతో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 11 రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాలు ప్రజలను అలరించనున్నాయి. ఇందుకోసం విజయవాడలో నాలుగు ప్రధాన వేదికలు సిద్ధమయ్యాయి. తుమ్మలపల్లి కళాక్షేత్రం, పున్నమి ఘాట్, ఎక్స్‌పో గ్రౌండ్ (గొల్లపూడి), జివిఆర్ గవర్నమెంట్ మ్యూజిక్ అండ్ డాన్స్ కాలేజీలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. తుమ్మలపల్లి కళాక్షేత్రం సంప్రదాయ కళలకు, పునమి ఘాట్ ప్రముఖ గాయకులు, నర్తకుల సందడికి, ఎక్స్‌పో గ్రౌండ్ ఆధునిక వినోదానికి హబ్‌గా, జివిఆర్ కళాశాలలో విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనలకు వేదిక కానున్నాయి. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రతిరోజూ కూచిపూడి నృత్యాలు, హరికథ, బుర్రకథ, తోలు బొమ్మలాట, సోషియల్ ప్లేలెట్స్ లాంటి సంప్రదాయ కళారూపాలు ప్రదర్శించనున్నారు. వీరనాట్యం, గరగలు, కలికా వేషాలు వంటి ప్రత్యేక ప్రదర్శనలు అలరించనున్నాయి. పున్నమి ఘాట్ వేదికపై ప్రముఖ గాయకులు, సంగీత విద్వాంసులు, నర్తకులు ఒకరి తర్వాత ఒకరు సందడి చేయనున్నారు. వర్షిణి, అబిజిత్ నిమ్మగడ్డ, కార్తీక్, కాసర్ల శ్రావణి, అనన్య పాండా, నందన్ నారాయణ్ ఇషాన్, కైలాష్ వంటి ప్రముఖుల ప్రదర్శనలు ప్రేక్షకులకు మరపురాని అనుభూతి కలిగించనున్నాయి. గొల్లపూడి వద్ద ఏర్పాటు చేసిన ఎక్స్‌పో గ్రౌండ్ వినోదానికి హబ్‌గా మారనుంది. మానసా వరణాసి, మణిశర్మ, కార్తీక్, సునీత, రామ్ మిరియాల, గీతా మాధురి, జామ్ జంక్షన్ బ్యాండ్ వంటి గాయకులు, బ్యాండ్స్ తమ అద్భుత ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించనున్నారు. ఫుడ్ ఫెస్టివల్స్, వినోద ప్రదర్శనలు ఈ వేదికలో మరో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. జివిఆర్ మ్యూజిక్ అండ్ డాన్స్ కాలేజ్‌లో కూచిపూడి, ఆంధ్రనాట్యం, భరతనాట్యం, బుర్రకథ, హరికథతో పాటు మిమిక్రి, హాస్య విన్యాసాలు, జానపద నృత్యాలు, డాల్ డాన్స్, రోబో డాన్స్ వంటి వినూత్న ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించనున్నాయి.

పున్నమి ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపి

విజయవాడ ఉత్సవ్‌లో భాగస్వామ్యం కావాలి : ఎంపి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: దసరా ఉత్సవాల సందర్భంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న విజయవాడ ఉత్సవ్‌లో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) పిలుపునిచ్చారు. ప్రభుత్వ సహకారంతో సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సారథ్యంలో 11 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు సంబంధించి భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో కూటమి నేతలతో కలిసి ఎంపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యాటకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవ్‌కు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తదితరులను ఆహ్వానించామన్నారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఏపీ ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షులు పెనుగొండ సుబ్బారాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ముత్తవరపు మురళి, బొప్పన భవకుమార్, ఫతావుల్లా, సోలంకి రాజు, కోగంటి రామారావు పాల్గొన్నారు.

దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సిపి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మకు విజయవాడ పోలీసులు పుట్టింటి సారే ఘనంగా సమర్పించారు. బెజవాడ కనకదుర్గమ్మను తమ ఇంటి ఆడపడుచుగా ఆరాధిస్తూ పుట్టింటి సారె సమర్పించే కార్యక్రమాన్ని విజయవాడ పోలీసులు సాంప్రదాయంగా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో గల అమ్మవారి దేవాలయంలో విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు సతీసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ ఊరేగింపుతో ఇంద్రకీలాద్రికి చేరుకున్న సిపి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. దీంతో దసరా ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వి.కె.శీనానాయక్, డిసిపిలు సరిత, తిరుమలేశ్వరరెడ్డి, ఉదయరాణి తదితరులు పాల్గొన్నారు.

విఎంసి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-విజయవాడ: దసరా ఉత్సవాలకు విఎంసి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. తాగునీరు సరఫరా, పారిశుధ్యం, మరుగుదొడ్లు, చెప్పుల స్టాండ్లు, సామాన్లు భద్రపరచు ప్రదేశం సిద్ధమని తెలిపారు. 39 ప్రాంతాలలో 60 లక్షల వాటర్ బాటిల్స్‌ను సిద్ధం చేశామని,19 ప్రాంతాల్లో 405 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. 1490 సిబ్బందితో 24 గంటలు మూడు షిఫ్ట్‌లలో పారిశుధ్య నిర్వాహణ, ప్రజల సౌకర్యార్థం ఆరు ప్రాంతాలలో ఉచిత చెప్పుల స్టాండ్లు, సామాన్లు భద్రపరచ ప్రదేశము ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

దుర్గమ్మ దర్శనానికి సాంకేతికత తోడు

ప్రజాశక్తి-విజయవాడ: దసరా శరన్నవరాత్రుల్లో సాంకేతికత తోడుగా సామాన్య యాత్రికులకు అమ్మవారి దర్శనం లభించేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, హోల్డింగ్ ప్రాంతాలు, 1.8 కి.మీ మేర ఉన్న క్యూలైన్ ఇలా వివిధ ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ పోస్టర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి 100 మీటర్లకు ఈ కోడ్ పోస్టర్లను అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా దసరా ఉత్సవాల ఏర్పాట్లపై అభిప్రాయాలు లేదా సమస్యలను తెలియజేయవచ్చన్నారు. వాయిస్ రికార్డ్ ద్వారా, 8885592974 నెంబరుకు కాల్ చేసి సమస్యను తెలియజేయవచ్చని తెలిపారు.

యాత్రికుల భద్రతకు ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రతిష్టాత్మకంగా జరిగే దసరా ఉత్సవాల వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా తెలంగాణా, కర్నాటక ప్రాంతాల నుండి యాత్రికులు వస్తారని, యాత్రికుల భద్రత దష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీసు శాఖ, రెవిన్యూ యంత్రాంగం సమన్వయం చేసుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. దసరా బందోబస్తు సందర్భంగా వివిధ జిల్లాల నుండి విధులు నిర్వహించడానికి వచ్చిన సిబ్బంది, అధికారులకు ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో 24 డ్రోన్లు దేవస్థానం పరిసర ప్రాంతాలలో వాస్తవిక పరిస్థితులను ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరవేస్తాయన్నారు. విఐపి దర్శనాలను కూడా ఒక ప్రత్యేకమైన సమయం కేటాయించామన్నారు. నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రత్యేకంగా కృత్రిమ మేధ వినియోగిస్తున్న కారణంగా పోలీసులకు బాధ్యతాయుతమైన సేవలు అందించేందుకు ఈ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడుతుందన్నారు. విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ దాదాపు పది వేల మంది దసరా సందర్భంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో డిసిపిలు సరిత, తిరుమలేశ్వరరెడ్డి, ఉదయరాణి, ఎస్.వి.డి.ప్రసాద్, సాయిప్రసాద్, ఆనందరెడ్డి , ఉదయాభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

• సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి-నందిగామ

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా ఆదివారం నందిగామలోని బాబూ జగ్జీవన్ రామ్ భవనం నుండి పాతబస్టాండ్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తోన్న మారణహోమాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ దేశాలు యావత్తు మారణహోమం ఆపాలని కోరుతున్నా ఇజ్రాయిల్ ఏమాత్రం కనికరం లేకుండా అమాయక ప్రజలను పొట్టన పెట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రధాని మోడీ మొద్దు నిద్ర పోతున్నారని విమర్శించారు. హెచ్ 1 వీసా పేరుతో లక్షన్నర డాలర్లు చెల్లించాలంటూ మన విద్యార్థులను అమెరికా నుండి బయటకు పంపుతున్నా జాతీయ ఉద్యమ స్ఫూర్తి కలిగిన బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు ఏమాత్రం పట్టడం లేదన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను సిపిఎంతో పాటు కలిసి వచ్చే పార్టీలతో పెద్ద ఎత్తున ప్రజాభిప్రాయాలు తీసికొని ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, కోట కళ్యాణ్, నందిగామ కార్యదర్శి కటారపు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనలో పాల్గొన్న సిహెచ్.బాబూరావు

తిరువూరులో భారీ వర్షం

ప్రజాశక్తి - తిరువూరు

తిరువూరు నియోజకవర్గంలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగి పొర్లుతున్నాయి. తిరువూరు నుండి పుట్రేల రోడ్డులోని మల్లెల వద్ద రహదారిపై ప్రవహిస్తున్న వరదతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఎస్ఐ సత్య నారాయణ చర్యలు తీసుకుని వరద తగ్గేవరకు పోలీసు సిబ్బందిని అక్కడే ఉంచారు. మునుకుళ్ళ శివాలయం వద్ద గుర్రపు వాగు తిరువూరు, ఊటుకూరు రోడ్డుపై వరద ప్రవహించడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించారు. చౌటపల్లి వాగు పొంగడంతో చౌటపల్లి, జి కొత్తూరు తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తిరువూరులో 8.86 సెంటి మీటర్లు, గంపలగూడెంలో 7.58 సెంటి మీటర్లు, విస్సన్నపేటలో 5.12 సెంటి మీటర్లు, ఏ.కొండూరులో 5.04 సెంటిమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

సహకార సంఘాలు బలోపేతం కావాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని పోచంపల్లి గ్రామంలో పోచంపల్లి పిఎసిఎస్ వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గ్రామ పిఎసిఎస్ చైర్‌పర్సన్ ముల్లంగి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మహాజనసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మెరుగైన సౌకర్యాలు, రుణ సదుపాయాలు అందించేలా సహకార సంస్థలు మరింత బలోపేతం కావాల్సిన అవసరముందని పేర్కొన్నారు. అనంతరం డ్వాక్రా గ్రూప్‌లకు రుణాల చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవరం పిఏసిఎస్ అధ్యక్షులు కట్ట వెంకట నరసింహారావు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు శిక్షణ

ప్రజాశక్తి-వత్సవాయి : నిరక్షరాశులను అక్షరాసులుగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు మండల పరిషత్తు అధ్యక్షులు మార్యంపూడి గాంధీ అన్నారు. పెనుగంచిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో వాలంటీర్ టీచర్లకు ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అక్షరాంధ్రలో భాగంగా పెనుగంచిప్రోలు మండలంలోని వెలుగు డిఆర్‌డిఎ, ఎన్రోల్ లనుండి 380 మంది వాలంటీర్ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు మార్యంపూడి గాంధీ, జడ్‌పిటిసి కోట్ల నాగమణి, ఎంపిడిఒ జి శ్రీను, ఎంఇఒ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శామ్‌సంగ్ గెలాక్సీపై పండుగ ఆఫర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్సంగ్, ఎంపిక చేసిన గెలాక్సీ స్మార్ట్‌ఫోన్‌లపై మునుపెన్నడూ చూడని ధరలను ప్రకటించిందని సంస్థ ఇన్‌ఛార్జ్ కె.ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక ధరలతో, కస్టమర్‌లు గెలాక్సీ స్మార్ట్‌ఫోన్‌లను ఆకర్షణీయమైన ధరలకు సొంతం చేసుకోవచ్చన్నారు. గెలాక్సీ ఎఫ్36 5జీ కేవలం రూ.13999లకే అందుబాటులో ఉంటుందని, గెలాక్సీ ఎఫ్06 5జీ రూ.7499 నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. గెలాక్సీ ఎస్24 అల్ట్రా, గెలాక్సీ ఎస్24, గెలాక్సీ ఎస్24 ఎఫ్ఈ, గెలాక్సీ ఎ35 5జీ, గెలాక్సీ ఎ36 5జీ, గెలాక్సీ ఎ16 5జీ, గెలాక్సీ ఎఫ్36 5జీపై ఆఫర్‌లు ఈ నెల 22 నుండి వర్తిస్తాయని తెలిపారు.

ఘనంగా గురజాడ జయంతి

ప్రజాశక్తి - తిరువూరు :

సాహితీ రంగంలో ఒక నూతన అధ్యాయానికి పునాది వేసిన అభ్యుదయ కవి గురజాడ అప్పారావు అని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) మాజీ కార్యదర్శి వసుపులేటి వెంకయ్య అన్నారు. స్థానిక గ్రంధాలయంలో గురజాడ అప్పారావు 163వ జయంతిని ఆదివారం తిరువూరు రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో అరసం అధ్యక్షురాలు ఉయ్యూరు అనసూయ, ప్రధాన కార్యదర్శి రేపాక రఘునందన్, ప్రముఖ న్యాయవాది తాళ్లూరి రామారావు, జనవిజ్ఞాన వేదిక నాయకులు కడిమి పాపారావు, తిరసం కార్యదర్శులు భరతకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలం కొమ్మిరెడ్డిపల్లిలో ఫ్లోరైడ్ నీళ్ల తాగి అనారోగ్యం భారినపడుతున్న దళితులకు ఉపశమనం కలిగించారు ఎఎంసి మాజీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి కుటుంబ సభ్యులు. నాగనర్సిరెడ్డి కుటుంబ సభ్యులు వితరణ చేసిన రూ.3 లక్షలతో నిర్మించిన మంచినీటి సరఫరా ప్లాంట్‌ను ఆదివారం నాగనర్సిరెడ్డి భార్య, మునకుళ్ళ మాజీ సర్పంచ్ శీలం సంధ్యారాణి ప్రారంభించారు. ఫ్లోరైడ్ రహిత మంచినీళ్లను అందించటం అభినందనీయని గ్రామస్తులు పేర్కొన్నారు.

చలో 'అసెంబ్లీ'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-గంపలగూడెం : ఈ నెల 22న తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షుడు గువ్వల సీతారామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. కూటమి ప్రభుత్వం రైతుకు మేలు చేస్తానని ఎన్నికల సమయంలో వాగ్దానం చేసి, నేడు మరిచిపోయిన విధానాన్ని వివరించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీకి పిలుపునిచ్చినట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి రైతాంగం అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

• మాజీ మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-జి కొండూరు :

బాధితులను పరామర్శిస్తున్న జోగి రమేష్

మహిళ అని చూడకుండా విచక్షణ రహితంగా దాడి చేసిన గురాజు పాలెనికి చెందిన టిడిపి గుండాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి జోగి రమేష్ డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకుల దాడిలో గాయపడిన చిన్న నందిగామ గ్రామానికి చెందిన మాధవి, భువనేంద్రాలను ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళను కట్టేసి కొట్టటం అనాగరిక చర్య అన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

టిడిపి కార్యాలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-విస్సన్నపేట : విస్సన్నపేట మండలంలో టిడిపి కార్యాలయ నిర్మాణానికి టిడిపి సీనియర్ నాయకులు వల్లభనేని సత్యనారాయణ రూ.40 వేలు విరాళంగా అందజేశారు. విరాళానికి సంబంధించిన నగదును ఆదివారం పార్టీ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణను తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాయల సుబ్బారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అనుమోలు శివ, బాజీ, మారేష్, అబినేని మల్లి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ నగర్ వికాస మండలి ఏర్పాటు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : గుంటుపల్లి గ్రామంలోని రామకృష్ణ నగర్ వాసులంతా కలిసి 9 మందితో కార్యనిర్వాహక బృందంతో రామకృష్ణ నగర్ వికాస మండలిని ఏర్పాటు చేసుకున్నట్లు మండలి కమిటీ సభ్యులు తెలిపారు. తమ ప్రాంతం అభివృద్ధి కోసం కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటిగా ఈ ప్రాంతంలో ఖాళీగా ఉన్న పార్కు స్థలాన్ని గ్రామస్తులు, పంచాయతీ సమిష్టి సహకారంతో అభివృద్ధి చేసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు.

నేటి నుంచి దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-వత్సవాయి :మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కిషోర్ కుమార్ తెలిపారు 22న ఉదయం కళశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని అన్నారు. 29న మూల నక్షత్రం సందర్భంగా పూజ ఉంటుందని, 30న చండీ హోమం ఉంటుందని తెలిపారు.

సిపిఎం సభ్యులు మృతి

విజయవాడ : మొగలరాజపురం సిపిఎం-1వ శాఖ సీనియర్ సభ్యుడు మున్నంగి వెంకటేశ్వరరావు (64) (బాబు) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వెంకటేశ్వరరావు 1985 నుండి పార్టీ సభ్యుడుగా ఉన్నారు. తుది శ్వాస విడిచే వరకు పార్టీ పట్ల అత్యంత విశ్వాసంగా ఉన్నారు. ప్రజాశక్తి వారపత్రికగా ఉన్నప్పుడు మొగలరాజపురంలో కొండ ప్రాంతాలకు కూడా వెళ్ళి ప్రజాశక్తిని పంపిణీ చేసేవారు. వెంకటేశ్వరరావు భౌతికకాయంపై పార్టీ సీనియర్ నాయకులు మురహరి, తూర్పు నగర కమిటీ సభ్యులు స్టాలిన్, శాఖా కార్యదర్శులు శ్రీనివాసరావు, శివకుమార్, శేషుకుమారి, నిరంజనరావు, పరసా కిరణ్ తదితరులు ఎర్ర జెండా కప్పి, పూలమాల వేసి నివాళు లర్పించారు.

పాఠశాల అభివృద్ధికి వితరణ

ప్రజాశక్తి-విస్సన్నపేట : విస్సన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం 1981- 1982 విద్యా సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థులు రూ. 2,11,600లను వితరణ చేశారు. ఈ నగదును జిల్లా పరిషత్ హెచ్ఎం శోభారాణి, వెంకటేశ్వరరావు, లలిత రామకృష్ణ, జగ్గవరపు రంగారెడ్డికి ఆదివారం అందజేశారు. పాఠశాల అభివృద్ధి కోసం నగదును వినియోగించాలని కోరారు.

విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి-వత్సవాయి

నీట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఓపెన్ క్యాటగిరిలో మెడికల్‌లో సీట్లు సాధించిన శ్రీ చైతన్య హైస్కూల్ పూర్వ విద్యార్థులు చెన్నం రుచిత, గణేష్‌లను హైస్కూల్ ఆవరణంలో ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ వినోద్ కుమార్, ఉపాధ్యాయులు పూర్ణచంద్రరావు కలిసి విద్యార్థులను సత్కరించి అభినందనలు తెలిపారు.

ఏటూరులో పోషకాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి-చందర్లపాడు

చందర్లపాడు మండలం ఏటూరు గ్రామంలోని అంగన్వాడి సెంటర్లో పోషకాహార వారోత్సవాలు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ పోషకాహారంతో పిల్లలు చురుకుగా ఉంటారని, అందరూ పోషకాహార విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చటారి సుజాత, ద్వారక, రమణ, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

ఉచిత విద్య మిధ్యేనా...?

రాష్ట్ర ప్రభుత్వం పేద వర్గాల పిల్లలకు ఆర్భటంగా ప్రకటించిన ఉచిత విద్య మిధ్యగానే మారిందని విమర్శలు వినబడుతు న్నాయి. ప్రభుత్వం ఉదాసీనాం కారణంగా ఈ ఏడాది కృష్ణాజిల్లాలో వందలాది మంది పేద వర్గాల పిల్లలకు ఉచిత విద్య అందకుండా పోయింది. పేద వర్గాల పిల్లలకు విద్యను దూరం చేసేం దుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందన్న విమర్శలు వినబడుతున్నాయి.

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :ఉచిత విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) కింద ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాలను కల్పించడంలో ప్రభుత్వ ఈ ఏడాది నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా కష్ణా జిల్లాలో పేద వర్గాల పిల్లలు విద్యార్థులు కార్పొరేట్ ప్రైవేట్ విద్యకు దూరం అవుతున్నారు. ఆర్ఫన్, హెచ్ఐవి, ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వారికి 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు నాలుగు శాతం, వెనుక బడిన వర్గాలు, ఇతరులకు ఆరు శాతం ప్రవేట్ పాఠశాలల్లో సీట్లు కేటాయిస్తారు. 2024-25 విద్యాసంవత్సరంలో 1,422 మంది విద్యార్థులకు ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయితే 1,136 మంది పాఠశాలల్లో చేరారు. అదే 2025-26లో పరిస్థితి దారుణంగా మారింది. కేవలం 592 ప్రవేశాలు మాత్రమే కల్పించగా అందులో 408 మంది విద్యార్థులు మాత్రమే ప్రైవేట్ స్కూళ్లలో ప్రవేశాలు పొందారు. అంటే ఒక ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం సముచిత నిబంధనలు అమలు చేయకపోవడంతో 724 మంది విద్యార్థులు ఉచిత విద్యా హక్కు నుండి దూరమయ్యారు.

ఫీజుల నిర్ణయంలో తీవ్ర జాప్యం

జిల్లాలో నిర్బంధ ఉచిత విద్యా హక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులతో కూటమి ప్రభుత్వం ఆటలాడుతోంది. సకాలంలో ఒక్క నిర్ణయం తీసుకోకుండా పేద పిల్లలకు తీవ్ర అన్యాయం చేస్తోంది. ఇప్పటికే ఫీజుల ఖరారులో తీవ్ర జాప్యం జరిగింది. ఫలితంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆర్టీఈ కింద అడ్మిషన్లు నిరాకరించాల్సి వచ్చింది. ప్రభుత్వ వైఖరిపై విమర్శలు వెల్లువెత్తడంతో, రొండవసారి ఆర్టీఈ కింద అడ్మిషన్ల పేరుతో కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. ఐదు కిలోమీటర్ల పరిధిలోని స్కూళ్లలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. అయితే జూన్లో పూర్తి కావాల్సిన అడ్మిషన్ల ప్రక్రియను ఆగస్ట్ 31 వరకు కొనసాగింది. రెండవ విడతలో 260 మంది ఎంపికవ్వగా 104 మంది మాత్రమే ప్రైవేట్ స్కూళ్ళలో చేరారు.

ఆర్టీఈ చట్టం-2009 కింద ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయిం చాలి. ప్రతి విద్యా సంవత్సరం మే నెలలో నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించి, అర్హత గల విద్యార్థులకు లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయించాలి. అయితే, 2025-26లో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇది అస్తవ్యస్తంగా మారింది. మొదటి విడత (ఫేస్-1)లో ఎంపికైన 430 మంది పిల్లల్లో 331 మంది మాత్రమే ప్రైవేట్ స్కూళ్లలో చేరగలిగారు. ప్రభుత్వం ఫీజులను సకాలంలో ఖరారు చేయకపోవడంతో, స్కూళ్ళ యాజమాన్యాలు ఆర్టీఈ కింద అడ్మిషన్లు ఇవ్వడం నిలిపివేశారు. పాఠశాలలు ప్రారంభమై 4 నెలలు గడుస్తున్న, జూలైలో కొందరు మాత్రమే పూర్తి ఫీజు చెల్లించి అడ్మిషన్లు తీసుకున్నారు. ఆ తర్వాత జూలై

24న ప్రభుత్వం ఫీజులను ఖరారు చేసింది. దీనివల్ల పేద వర్గాల విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగింది. మొదట విడత (ఫేస్-2)లో ఎంపికైన 162 మందిలో కేవలం 77 మంది, ఫేస్-3లో ఒక్కరు మాత్రమే ప్రైవేట్ స్కూళ్ళలో చేరారు.

ఆర్టీఈ సీట్లపై కొత్త వివాదం

కూటమి ప్రభుత్వం ఇటీవల ఆర్టీఈ కింద ప్రవేశాలకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేసింది. ఇప్పటివరకు 3 కిలోమీటర్ల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రమే విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా, ఇప్పుడు ఆ పరిధిని 5 కిలోమీటర్లకు పొడిగించింది. ఒకటో తరగతి ప్రవేశాలకు ఆసక్తి చూపేవారు ఐదు కిలోమీటర్ల పరిధిలోని ఏ ప్రైవేట్ పాఠశాలలోనైనా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. అయితే ఆర్టీఈ కింద సీట్లు పొందే విద్యార్థులు ఫీజులు స్వయంగా చెల్లించాల్సి ఉంటుందని ప్రైవేట్ స్కూళ్ళ యాజమాన్యాలు స్పష్టం చేయటం ఆందోళన కలిగించింది. వాస్తవానికి ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు దాటిపోయాయి. ఇలాంటి నిర్ణయాలు విద్యార్థుల హక్కులను దెబ్బతీయడంతో పాటు తల్లిదండ్రులను అయోమయంలోకి నెడుతున్నాయని విద్యా వర్గాల తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక-మీకోసం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మీకోసం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాల యాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజే యవచ్చన్నారు.

మండలి జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమ గాంధీగా నిబద్ధత నిజాయితీ కలిగిన పనితీరుతో దివిసీమలో అనేక సంస్కరణలకు అభివృద్ధికి ఆద్యుడిగా పేరుగాంచిన మాజీ మంత్రి మండలి వెంకటకష్ణారావు జీవిత చరిత్రను తెలుగు పాఠ్యాంశంగా చేర్చాలని ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం అవనిగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాదును అవనిగడ్డలో ఆయన స్వగహం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషా సంఘానికి మండలి వెంకటకష్ణారావు పేరు పెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రిగా పనిచేస్తూ దివిసీమను విద్యాసీమగా ఆవిష్కరిం చడంతోపాటు నియోజకవర్గంలో అర్హత ఉన్న వేలాది మంది అభ్యర్థులను ఉపాధ్యాయులుగా నియమిం చిన ఘనత కృష్ణారావుకు దక్కుతుందన్నారు. ఖైతేపల్లి రాజేష్, ఎం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధప్రసాదును సన్మానిస్తున్న దృశ్యం

సొసైటీ దూరం...రవాణా భారం...

- **ఎరువులు తెచ్చుకునేందుకు శివారు గ్రామాల రైతుల అవస్థలు**

ప్రజాశక్తి-గన్నవరం : ఎరువుల కోసం రైతులు రెండు నుంచి ఆరు కిలో మీటర్లు వెళ్లాల్సి వస్తోంది. దీనితో సన్న,చిన్నకారు, కౌలు దారులు ఒకటి, రెండు బస్తాలను సైకిళ్ల మోపెడ్లపై తీసుకెళ్లాల్సి వస్తోంది. అయితే రహదారులు పూర్తిస్థాయిలో బాగుపడకపోవడంతో రవాణాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలు, ఇతర వాహనాలపై చేరవేతకు అదనపు ఖర్చవుతు తోందని వాపోతున్నారు.

28 గ్రామాలు. 9 సొసైటీలు : గన్నవరం మండలంలో 28 గ్రామాలుండగా 9 సొసైటీల ద్వారా ఎరువుల పంపిణీ జరుగుతోంది. సాధారణ పరిస్థితుల్లో ఎలా ఉన్నా కొరత సమయంలో శివారు గ్రామాల రైతులు వ్యయప్రయా సలకు గురవుతున్నారు. వీరపనేని గూడెం సంఘ పరిధిలోని తెంపల్లి, బల్లి పర్రు, మెట్లపల్లి మూడు కిలోమీటర్లు, కొత్తగూడెం నుండి కార్యాలయానికి 5 కిలోమీటర్లు, బీబీ గూడెం సొసైటీ కీ గొల్లనపల్లి నుంచి ఐదు కిలోమీటర్లు, చిక్కవరం రైతులకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అలాగే బుద్ధవరం సొసైటీకి దావాజీగూడెం రైతులు వెళ్లాలంటే ఆరు కిలోమీటర్లు ఉంటుంది. బూతిమల్లిపాడు రైతులకు ఐదు కిలోమీటర్లు వెళ్లాలి. దీంతో శివారు గ్రామాల రైతులకు ఎరువుల పంపిణీ తేదీలు సమయం సకాలంలో తెలియడం లేదని చెబుతున్నారు. ఆటోల్లో ఎరువులు తీసుకువెళ్లాలంటే వంద నుంచి 200 రూపాయలు ఖర్చు అవుతుంది. మూడుసార్లు తిరిగితే రూ. 600 అవుతుందని కౌలుదారులు చెప్తున్నారు. శివారు గ్రామాల్లో చిన్న రైతులకు, కౌలు రైతులకు ఖర్చు ఎక్కువగానే ఉంటుంది. వ్యవసాయానికి ఎకరానికి 20,000 ఖర్చు అవుతుంటే అందులో ఆటోల్లో ఎరువులు తీసుకురావడానికి రూ. 1000 అవుతుందని చెప్పారు. 10 ఎకరాలు కౌలుకు చేసే రైతుకు అయితే ఆటో కిరాయిలు 10 వేలు దాకా అవుతాయని చెప్పారు.

ఇలా చేయాలని రైతుల వినతి

రైతు సేవా కేంద్రం స్థాయిలో ఎరువుల పంపిణీ చేయాలి. సాగు విస్తీర్ణానికి అనుగు ణంగా ఆయా గ్రామాలకే ఎరువులు పంపి స్థానిక రైతులకు అందజేయాలి. ఒకరోజు ముందుగానే శివారు గ్రామాల్లోని వారికి సమాచారం తెలియజేయాలి. అన్ని గ్రామపంచాయతీలో రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వాటి ద్వారా కూడా ఎరువుల పంపిణీ చేయాలని అంటున్నారు.

ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలి : ఎస్ఐ

ప్రజాశక్తి- నందివాడ: మండలంలోని దసరా పండుగ సందర్భంగా ప్రజల శాంతి భద్రతల కోసం దసరా ఉత్సవ కమిటీలతో ఆదివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కె.శ్రీనివాస్ కమిటీల సభ్యులకు పలు సూచనలు చేశారు. పండుగ కార్యక్రమాలు, శోభాయాత్రలు, అలంకరణలు సమయపట్టికలోనే జరగాలని, రాత్రి వేళల్లో శబ్ద కాలుష్యం కలిగించే డీజేలు, లౌడ్‌స్పీకర్లు నియంత్రణలో ఉంచాలని సూచించారు. అనుమతి లేకుండా ర్యాలీలు, మోతాదుకు మించిన ధ్వని పరికరాలు, పటాకులు

సూచనలిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

వాడరాదని హెచ్చరించారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా వాహన పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణలో కమిటీ సభ్యులు పోలీసులకు సహకరిం చాలని కోరారు. పండుగ సమయంలో సామాజిక శాంతి, సామరస్యాన్ని కాపాడుతూ ఇతర మతాల మనో భావాలను దెబ్బతీయకుండా ఉండాలని సూచించారు.

పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ బోడే ప్రసాద్

సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కంకిపాడు : తాడిగడప మున్సిపాలిటీ కానూరు గ్రామంలో మహాదేవపురం కాలనీ నుండి వృద్ధాశ్రమం వరకూ ఒక కోటి 53 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ కానూరులో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, నియోజకవర్గ ప్రజలందరికీ సంక్షేమం, అభివద్ధి అందించడానికి కషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

ప్రజాశక్తి-చల్లపల్లి : వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చల్లపల్లిలో ఉచిత హెూమియో వైద్య శిబిరం నిర్వహించారు. హెూమియో వైద్యులు మణికంఠ 60 మంది రోగులను పరీక్షించి ఉచితంగా హెూమియో మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజేటి అమం౯వాణి, గోళ్ళ వెంకటరత్నం, అన్నం సత్యవాణి, దింటకుర్తి జ్యోతి, సువర్చల కుసుమ గణపతి లు శిబిరంలో సేవలు అందించారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని శీలంవారి పాలెంకి చెందిన కొండవీటి రామాంజ నేయులు కుమారుడు గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మంగళ౯గిరిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కూటమి నేతలు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), దాసం రామకష్ణ, కొండవీటి కోటిల సహకారంతో ఆ చిన్నారి వైద్య ఖర్చులకు 5 వేలు ఆర్థిక సహాయాన్ని ఆది వారం అందజేశారు. ఉప సర్పంచ్ శీలం శ్రీనివాస్, కూట మి నాయకులు కొండవీటి నాని, జీళ్ళ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బందరులో భారీ వర్షం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : క్షణాల్లో వాతావరణం మార్పుతో ఆదివారం సాయంత్రం మచిలీపట్నంలో ఉరుములు మెరుపులతో కురిసిన వర్షంతో అప్పటివరకు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు ఉపసమనం కలిగించింది. నగరంలో ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు విపరీతంగా ఎండలు కశాయి. అయితే సాయంత్రం ఒక్కసారిగా వాతావ రణంలో మార్పులు చోటు చేసుకుంది. క్షణాల్లో వాతావరణం కాస్త చల్లబడి మబ్బులు కమ్మేసాయి. ఉరుములు మెరుపులతో 40 నిమిషాలు పాటు కురిసిన వర్షానికి నగరంలో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతంలో నీరు నిలిచిపోయింది.

'విజయ నర్తనం' ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద విజయదశమి ఉత్సవ ఏర్పాట్లను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో పవిత్ర సంగమం వద్ద విజయ నర్తనం పేరుతో విజయదశమి ఉత్సవాలకు శ్రీకారం చుట్టినట్లు మైలవరం ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేవి నవరాత్రుల సందర్భంగా దసరా సాంస్కృతిక, ఆధ్యాత్మిక మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పవిత్ర సంగమానికి పూర్వ వైభవం తెచ్చేలా టిడిపి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు, టిడిపి రాష్ట్ర నాయకులు జంపాల సీతారామయ్య, మైలవరం నియోజకవర్గ జనసేన అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్రావు (గాంధీ), తదితరులు పాల్గొన్నారు

ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా మూవ్‌మెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

వేగవంతమైన సేల్, ఇన్‌స్టామార్ట్ క్విక్ మూవ్‌మెంట్ 2025 ఇప్పుడు స్విగ్గీ, ఇన్‌స్టామార్ట్ యాప్‌లలో ప్రత్యక్ష ప్రసారం చేయబడుతోందని సంస్థ ఇంచార్జి కె.కరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 వరకు, వినియోగదారులకు పది రోజులపాటు 50 నుండి 90 శాతం వరకు అద్భుతమైన ఆదాలను, మెరుపు వేగంతో డెలివరీని, పండుగ ఉత్సాహాన్ని అందిస్తోందన్నారు. వినియోగదారులు వివిధ కేటగిరీల్లో భారీ డిస్కౌంట్లు, హాటెస్ట్ లాంచ్‌లు, అగ్రశ్రేణి బ్రాండ్‌ల నుండి పండుగ డీల్స్‌ను ఆశించవచ్చని తెలిపారు.

దసరా ఉత్సవాలకు శ్రీ మహాలక్ష్మి ఆలయం ముస్తాబు

ప్రజాశక్తి -విజయవాడ సిటీ : చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 22 నుండి అక్టోబర్ రెండు వరకు విజయదశమి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం కమిటీ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారం, 23న శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా, 24న శ్రీ గాయత్రీ దేవిగా, 2న శ్రీ అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. 26వ శ్రీ కాత్యాయనీ దేవిగా, 27న శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా, 28న శ్రీ సంతోషిమాత దేవిగా, 2న మూలా నక్షత్రం సందర్భంగా శ్రీ సరస్వతి దేవి అలంకారంతో అమ్మవారు దర్శనమిస్తారని పేర్కొన్నారు. 30న దుర్గాష్టమి సందర్భంగా శ్రీ దుర్గా దేవిగా, అక్టోబర్ ఒకటో తేదీన శ్రీ మహిషాసుర మర్దనీ దేవిగా, 2న విజయదశమి సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.